



# కరపత్రం

SINCE 2014

ఆదివారం నవంబర్ 16 2025 | సంపుటి : 2 | సంచిక : 42 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## జూబ్లీహిల్స్ విజయం.. తెలంగాణ నేతలను అభినందించిన రాహుల్ గాంధీ

దిల్లీ:
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేసిన తెలంగాణ నేతలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో పాటు పలువురు నేతలు శనివారం దిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిశారు. ఈ సందర్భంగా.. ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు రాహుల్ శుభాకాంక్షలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కష్టపడిన నాయకులను అభినందించారు. జూబ్లీహిల్స్ ఎన్నిక విజయం గురించి రాష్ట్ర నేతలు రాహుల్‌కు వివరించారు.

## సిఎం రేవంత్ రెడ్డితో విన్ గ్రూప్ ఆసియా సీఈవో భేటీ

### తెలంగాణలో పరిశ్రమ ఏర్పాటుకు విన్ గ్రూప్ ఆసక్తి



హైదరాబాద్,నవంబర్15 :
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో విన్ గ్రూప్ ఆసియా సీఈవో సమావేశమయ్యారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉండగా, దేశ రాజధానిలో ముఖ్యమంత్రితో సీఈవో భేటీ అయ్యారు. తెలంగాణలో పరిశ్రమ ఏర్పాటు చేయడానికి విన్ గ్రూప్ ఆసక్తి కనబరిచింది. ఈవీలు, బ్యాటరీ స్టోరేజీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు విన్ గ్రూప్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. డిసెంబరు 8, 9 తేదీల్లో జరిగే తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరుకావాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారిని ఆహ్వానించారు. ఇదిలా ఉండగా, అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో పాటు పలువురు నేతలు శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిశారు.

## ఒవైసీ కాళ్లు మొక్కి, బండి సంజయ్‌తో కుమ్మక్కై..

### జూబ్లీహిల్స్‌లో రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ బలం లేదు

» నవీన్ యాదవ్ హవానే ఎక్కువ నడిచింది
» గెలిచింది రేవంత్ కాదు.. నవీన్ యాదవ్
» బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ విమర్శలు

2 లో



## వైద్యం వికటించి 17 మంది చిన్నారులకు అస్వస్థత

నల్గొండ:
వైద్యం వికటించి 17 మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రభుత్వాసుపత్రిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇటీవల వైరల్ ఫీవర్‌తో బాధపడుతూ వీరంతా ఆసుపత్రిలో చేరారు. శుక్రవారం సాయంత్రం చిన్న పిల్లల వార్డులో రోజూ లాగే పిల్లలకు వైద్యులు ఇంజక్షన్ ఇచ్చారు. దీంతో అరగంట తర్వాత వారికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. ప్రస్తుతం బాధితులకు ఐసీయూలో చికిత్స



అందిస్తున్నారు. ఒక ఇంజక్షన్ బదులు మరొకటి ఇచ్చారని వైద్యులతో తల్లిదండ్రులు వాగ్వాదానికి దిగారు. ప్రస్తుతం చిన్నారుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.



## అనుమతి ఉన్న బెట్టింగ్ యాప్ అని ప్రచారం చేశాను

సినీ నటుడు రానా దగ్గుబాటి వెల్లడి
బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం కేసులో సిట్ విచారణ

హైదరాబాద్,నవంబర్14 :
హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో సినీ నటుడు రానా దగ్గుబాటి సిట్ విచారణకు హాజరయ్యారు.

2 లో

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్.. ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష




హైదరాబాద్:
డిసెంబరులో ఫ్యూచర్ సిటీలో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ రామకృష్ణారావు ఆదేశించారు.

## తెలంగాణ హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్

♦ పోలీసులకు ఫిర్యాదు చేసిన రిజిస్ట్రార్ ♦ సీపీ సజ్జనార్ ఫేస్ బుక్ ఖాతా హ్యాక్

హైదరాబాద్,నవంబర్14 :
తెలంగాణ హైకోర్టు వెబ్‌సైట్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. ఆర్డర్ కాపీలు డౌన్‌లోడ్ చేస్తుండగా ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్ తెరచుకుంది. వెబ్‌సైట్ హ్యాకింగ్ పై హైకోర్టు రిజిస్ట్రార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పీడీఎఫ్ ఫైల్స్‌కు బదులుగా బీడీజీ స్లాట్ బెట్టింగ్ సైట్ వస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్‌పై సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు.




## కూరగాయల సాగుకు ప్రోత్సహం

» కొత్తగా 10 వేల ఎకరాల్లో సాగు
» రైతులపై రూ.9,600 నేరుగా సబ్సిడీ
» రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు!

హైదరాబాద్,నవంబర్15 :
రైతులకు ఇది నిజంగా గుడ్ న్యూస్ అని చెప్పాలి. రాష్ట్రంలో కూరగాయల కొరతను తగ్గిస్తూ స్థానిక అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2025%–%26 ఆర్థిక సంవత్సరానికి కొత్తగా 10 వేల ఎకరాల్లో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు నిర్ణయం తీసుకుంది.






## బీఆర్ఎస్ ఓటమికి హరీష్ రావు కుట్రలు

» హరీష్ రావు పార్టీకి మోసం చేస్తున్నాడు
» మరో బాంబు పేల్చిన కల్వకుంట్ల కవిత

హైదరాబాద్,నవంబర్15 :
ఇటీవల జూబ్లిహిల్స్ బై పోల్స్ లో బీఆర్ ఓటమి చెందిన విషయం తెలిసిందే.ఈ క్రమంలో దీనిపై కల్వకుంట్ల కవిత మరోసారి రియాక్ట్ అయ్యారు. ఇప్పటికే ఈ ఎన్నికలపై కర్మ ఎవరిని వదలొదు అంటూ.. తన సోషల్ మీడియా అకౌంట్ లో కవిత ట్వీట్ పెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా.. మరోసారి కల్వకుంట్ల కవిత మెదక్ పర్యటనలో బీఆర్ఎస్ ఓటమికి మాజీ మంత్రి హరీష్ రావు కుట్రలు చేశారని సంచలన వ్యాఖ్యలుచేశారు.

## 'ఏరో ఇంజిన్ రాజధాని' దిశగా అడుగులు

♦ 2030 నాటికి రాష్ట్రాన్ని ఆదిశగా తీర్చిదిద్దుతాం
♦ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హైదరాబాద్,నవంబర్15
గచ్చిబౌలి ఐఎస్బీ లో సమ్మిట్‌ను కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్, ఐఎస్‌బీ, ముంజాల్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ కలిసి నిర్వహించిన 'ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సమ్మిట్‌కు తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న వేగవంతమైన మార్పులను తెలంగాణ తనకు అనుకూలంగా మార్చుకునే దిశగా పనిచేస్తుందన్నారు. ప్రపంచంలో గ్లోబల్ సప్లై చెయిన్ ఒత్తిడికి గురవుతున్న సందర్భంలో నమ్మకమైన తయారీ కేంద్రాల కోసం ప్రపంచం భారత్ వైపు చూస్తోందని, ఇది తెలంగాణకు పెద్ద అవకాశమని అన్నారు. గతేడాది దేశ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.5 లక్షల కోట్లను దాటడం, రక్షణ ఎగుమతులు 12 శాతం వృద్ధి నమోదు చేయడం దేశ శక్తిని



సూచిస్తోందని వివరించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం కీలక భాగం కానుందని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో 25కి పైగా అంతర్జాతీయ, జాతీయ ఏరోస్పేస్ డిఫెన్స్ కంపెనీలు, 1,500కి పైగా ఎంఎస్ఎంఈలు తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచానికి తీసుకెళ్తున్నాయని తెలిపారు.

మిగతాద్ది 2 లో

## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..

### లొంగిపోయిన కీలక నేత ఆజాద్







## విజయం తలకెక్కి రెచ్చిపోతున్నారు

▪ బీఆర్ఎస్ కార్యకర్తపై కాంగ్రెస్ గూండాల దాడి ▪ మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్,నవంబర్15 :
విజయం తలకెక్కి విచ్చలవిడిగా కాంగ్రెస్ గూండాలు రెచ్చిపోతున్నారు. గెలిచి ఒక రోజు కూడా కాకముందే ప్రత్యర్థి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ గూండాలకు వార్నింగ్ ఇచ్చారు. దాడికి గురయిన కార్యకర్త కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. కాంగ్రెస్ చేస్తున్న రౌడీయిజాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ప్రకటించారు. గులాబీ కార్యకర్తపై జరిగిన దాడికి కాంగ్రెస్ బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్‌నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త రాకేశ్‌పై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడంతో శనివారం కార్యకర్తను పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌తో కలిసి మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గూండాయిజంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. దొంగ ఓట్లు, గూండా గిరి చేసి, డబ్బులు పంచి కాంగ్రెస్ గెలిచిందని కేటీఆర్ పునరుద్ఘాటించారు.

# అనుమతి ఉన్న బెట్టింగ్ యాప్ అని ప్రచారం చేశాను

మొదటిపేజీ తరువాయి

బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేసింది. ఇవాళ సీఐడీ సిట్ విచారణకు యాంకర్ విష్ణుప్రియ సైతం వచ్చారు. బెట్టింగ్ యాప్ ప్రచారానికి సంబంధించి విష్ణుప్రియను సిట్ అధికారులు ప్రశ్నించారు.బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం కేసులో రానాను దాదాపు గంటన్నర పాటు సీఐడీ అధికారులు పలు కోణాల్లో ప్రశ్నించినట్లు ప్రశ్నించారు. అనుమతి ఉన్న యాప్ అని తెలిశాకే ప్రచారం చేశానట్లు రానా అధికారులకు చెప్పినట్లు తెలిపారు. ఆ యాప్ గురించి తన న్యాయ బృందం విచారణ చేసిందని వెల్లడించారు. దీనిపై సీఐడీ అధికారులకు పూర్తిగా వివరించినట్లు పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రముఖ సినీతారలు, సెలబ్రిటీలు పెద్ద ఎత్తున ప్రచారం కల్పించడంతో పలువురు యువకులు వాటికి బానిసలై ప్రాణాలు పోగొట్టుకున్నారంటూ పలు పోలీస్?స్టేషన్?లలో కేసులు నమోదయ్యాయి. దీంతో వాటి విచారణకు తెలంగాణ సీఐడీ అదనపు డీజీపీ నేతృత్వంలో ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆయా కేసుల్లో విజయ్ దేవరకొండతో పాటు సినీ నటులు రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి, విష్ణుప్రియ, సిరి హనుమంత్ సహా మొత్తం 29 మంది నిందితులుగా ఉన్నారు. ఇప్పటికే పలువురు సెలబ్రెటీలను సిట్ అధికారులు విచారణ చేశారు. అందులో విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్‌ను సిట్ ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

# తెలంగాణ హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్

మొదటిపేజీ తరువాయి

తన పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా సృష్టించారని, ఆపదలో ఉన్నానని డబ్బు పంపాలని మెసేజ్ లు పంపిస్తున్నారని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఇప్పటికే ఒక స్నేహితుడు రూ.20 వేలు పంపి మోసపోయారన్నారు. డబ్బు పంపాలన్న మెసేజ్ లు ఎవరూ నమ్మవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులు, మెసేజ్ లు, వీడియో కాల్స్ బ్లాక్ చేయాలని కోరారు. ఆయా సైట్లు బ్లాక్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ మోసాలపై 1930 ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ సూచించారు. నా పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా సృష్టించారు. ఆపదలో ఉన్నానని, డబ్బు పంపాలని మెసేజ్‌లు పంపిస్తున్నారు. ఇప్పటికే ఒక స్నేహితుడు రూ.20 వేలు పంపి మోసపోయారు. డబ్బు పంపాలన్న మెసేజ్‌లు ఎవరూ నమ్మవద్దు. అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లు, వీడియో కాల్స్ బ్లాక్ చేయాలి. ఆయా సైట్లు బ్లాక్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని అన్నారు.

# 'ఏరో ఇంజిన్ రాజధాని' దిశగా అడుగులు

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ఏరోస్పేస్ ఎగుమతుల విలువ 2023-24లో రూ.15,900 కోట్లుగా ఉండగా, 2024%-%25లో తొలి తొమ్మిది నెలల్లోనే రూ.30,742 కోట్లకు పెరగడం ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల విజయాన్ని చూపిస్తోందని మంత్రి చెప్పారు. ఆదిభట్లలో టాటా, సాఫ్రాన్ రూ.425 కోట్ల విలువైన యంత్రాంగం ఇటీవల ప్రారంభమైందని, త్వరలోనే జేఎస్‌డబ్ల్యూ డిఫెన్స్ రూ.800 కోట్లతో యూఏవీ తయారీ కేంద్రం, ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ రూ.500 కోట్లతో డిఫెన్స్ ఫెసిలిటీ కూడా ప్రారంభంకానున్నాయని వెల్లడించారు. ఇంకా పలువురు దిగ్గజ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులపై ఆసక్తి చూపుతున్నాయని మంత్రి తెలిపారు.

# కూరగాయల సాగుకు ప్రోత్సహం

మొదటిపేజీ తరువాయి

రైతులపై భారం తగ్గించేందుకు ఎకరాకు రూ.9,600 సబ్సిడీని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 1.35 లక్షల ఎకరాల్లో 14.64 లక్షల టన్నుల కూరగాయల ఉత్పత్తి జరుగుతోంది. అయితే రాష్ట్రంలో దాదాపు 26 లక్షల టన్నుల కూరగాయల ఉత్పత్తి అవసరముంది. వ్యవసాయ విశ్వవిద్యాలయ సర్వే ప్రకారం.. 12.68 లక్షల టన్నుల లోటు ఉత్పత్తి ఉందని, ఈ లోటును పూడ్చేందుకు ప్రతి ఏడాది 10 వేల ఎకరాల్లో అదనపు సాగు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఉద్యానశాఖ అంచనా ప్రకారం ఎకరానికి విత్తనాలు, నారు, ఎరువులు, పురుగుమందులు, పోషక యాజమాన్యం వంటి ఖర్చులు కలిపి రూ.24,000 వరకూ ఉంటాయి. అందులో 40% సబ్సిడీగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రైతులకు రూ.9,600 మద్దతు లభిస్తుంది. ఒక్కో రైతు గరిష్ఠంగా 2.5 ఎకరాల వరకు ఈ సబ్సిడీ పొందవచ్చు. టమాట, వంకాయ, బెండకాయ, క్యాబేజీ, కాలీఫ్లవర్, మిర్చి, బీర, క్యాప్సికం, చిక్కుడు, కాకర, దొండ, సొరకాయ వంటి పంటలు వేసే రైతులు స్థానిక ఉద్యానశాఖ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన తర్వాత సాగు ప్రారంభించిన వెంటనే ఉద్యానశాఖ గుర్తించిన నర్సరీల నుంచి నారు%-%విత్తనాలు కొనుగోలు చేస్తే, వారికి సబ్సిడీ మొత్తాన్ని నేరుగా ఖాతాలో జమ చేస్తారు. సిద్దిపేట ములుగు, హైదరాబాద్ జీడిమెట్లలో ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నర్సరీలు ఈ ప్రాజెక్ట్ కోసం నాట్లు సిద్ధం చేస్తున్నాయి. రైతులకు అవసరమైన విత్తనాలను కూడా ప్రభుత్వం తక్కువ ధరకు అందిస్తుంది. రాష్ట్రంలో కూరగాయల ఉత్పత్తి పెంచి మార్కెట్లలో ధరలను స్థిరంగా ఉంచేందుకు ఈ ప్రోత్సాహక పథకం కీలకమవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది.

# విజయం తలకెక్కి రెచ్చిపోతున్నారు

మొదటిపేజీ తరువాయి

తాను అహంకారం తగ్గించుకోవాలన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందిస్తూ.. 'ఎవరిదీ అహంకారమో ప్రజలు గమనిస్తున్నారు. విజయ గర్వంతో నిన్న ఊరేగింపు తీశారు. మేము ఎన్నో ఎన్నికలు గెలిచాము. పార్టీ గుర్తును గాడిదకి ఎక్కించి ఊరేగింపు చేశామా?' అని ప్రశ్నించారు. ఒక్క ఎన్నికలో గెలిస్తేనే ఇంత మీడిసిపడితే.. గతంలో తాము ఎన్నో ఎన్నికలు గెలిచామని.. కానీ ఏనాడూ ఇలా వికృతంగా చేయలేదని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఓటమిపై మంగళవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తామని.. ఓటమిపై కారణాలు విశ్లేషిస్తామని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ గుండాయిజం మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.తాను అహంకారం తగ్గించుకోవాలన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందిస్తూ.. 'ఎవరిదీ అహంకారమో ప్రజలు గమనిస్తున్నారు. విజయ గర్వంతో నిన్న ఊరేగింపు తీశారు. మేము ఎన్నో ఎన్నికలు గెలిచాము. పార్టీ గుర్తును గాడిదకి ఎక్కించి ఊరేగింపు చేశామా?' అని ప్రశ్నించారు. ఒక్క ఎన్నికలో గెలిస్తేనే ఇంత మీడిసిపడితే.. గతంలో తాము ఎన్నో ఎన్నికలు గెలిచామని.. కానీ ఏనాడూ ఇలా వికృతంగా చేయలేదని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఓటమిపై మంగళవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తామని.. ఓటమిపై కారణాలు విశ్లేషిస్తామని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ గుండాయిజం మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# బీఆర్ఎస్ ఓటమికి హరీష్ రావు కుట్రలు

మొదటిపేజీ తరువాయి

జూబ్లిహిల్స్ బై పోల్స్ వేళ.. కొంత మంది ఇండిపెండెంట్ లు తన దగ్గరకు వచ్చి ఎవరికి మద్దతు ఇవ్వాలో అడిగారన్నారు. దీనికి తాను.. మీ ఇష్టమని వారికే వదిలేశానని చెప్పారు. అదే విధంగా.. వారంతా మరల హరీష్ రావును కలిసినా అదే మాట చెప్పారని తనకు తెలిసిందన్నారు. హరీష్ రావు పార్టీలో ఉంటూ.. బీఆర్ఎస్ ను మోసం చేశాడన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించి 12 ఏళు అయినా మెదక్ జిల్లా ప్రజల బతుకులు మారలేదన్నారు మెదక్ జిల్లాలో జరిగే అరాచకాలు కేసీఆర్‌కు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా.. గ్రూప్ వన్ ఉద్యోగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని ఫైర్ అయ్యారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు లతో సహా పలువురు బీఆర్ఎస్ (BRS) నాయకులపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాను వదిలేసి ప్రజల్లోకి వెళ్లి వారి బాధలను, సమస్యల్ని తెలుసుకోవాలన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రచారంను నమ్ముకుని ఈ రోజు జూబ్లిహిల్స్ ఉపఎన్నికల్లో ఓడిపోయిందన్నారు. అదే విధంగా.. బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, మదన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, నిరంజన్ రెడ్డిలు గతంలో ఎలా ఉండేవారని.. ఇప్పుడు వందల కోట్లు ఎలా సంపాదించారని ఏకిపారేశారు. బీఆర్ఎస్ నేతలు ఆస్తులు పెంచుకున్నారే కానీ... కేడర్‌ను మాత్రం పెంచుకోలేదని విమర్శలు గుప్పించారు. మరోవైపు.. హరీష్ రావు..రైతుల్ని కూడా బలిపశువును చేస్తున్నారని ఎద్దేవా చేశారు. హరీశ్‌రావు ఫాంహౌజ్ ఆ సమీపంలో రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ను మార్చారని ఎద్దేవా చేశారు. వీళ్లు చేసే అరాచకాల వల్లే బీఆర్ఎస్ కు ఈ గతి పట్టిందని కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు తప్పిదాల వల్ల.. కొల్చారం, పాపన్నపేట మండలాల్లోని పలు గ్రామాల్లో భూములు బీడు బారిపోతున్నాయన్నారు. మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని, మెదక్‌లో ఎలాంటి సౌకర్యాలు లేవని మెడికల్ సీట్లను సీఎం రేవంత్‌రెడ్డి తన స్వగ్రామం కొడంగల్‌కు తీసుకెళ్లారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ తో మెదక్ జిల్లారైతులకు చుక్క నీరుకూడా లభించలేదన్నారు. హరీశ్‌రావు బినామీలు, వారి కంపెనీలతో సీఎం రేవంత్‌రెడ్డికు సంబంధాలు ఉన్నాయని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణలో ప్రశ్నించే శక్తిగా జాగృతి పనిచేస్తునే ఉంటుందని కల్వకుంట్ల కవిత తెల్చి చెప్పారు.

# మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..

మొదటిపేజీ తరువాయి

మావోయిస్టు పార్టీకి తెలంగాణలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ కీలక నేత, భద్రాద్రి కొత్తగూడెం ఏరియా కమిటీ కార్యదర్శి ఆజాద్ అలియాస్ సాంబయ్య పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఆయనతో పాటు మరికొంతమంది కేడర్ కూడా జనజీవన స్రవంతిలో కలిసినట్లు సమాచారం. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మావోయిస్టులకు ఓ పిలుపునిచ్చారు. చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పౌర సమాజంలో కలిసిపోవాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలోనే ఆజాద్ లొంగుబాటు నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ విషయాన్ని పోలీసులు ఇంకా అధికారికంగా ధ్రువీకరించలేదు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన సాంబయ్య, 1995లో అజ్ఞాతంలోకి వెళ్లారు. గతంలో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కూడా పనిచేశారు. ఆయన తలపై ప్రభుత్వం రూ. 20 లక్షల రివార్డును ప్రకటించింది. ఆజాద్ లొంగుబాటుకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ఒవైసీ కాళ్లు మొక్కి, బండి సంజయ్‌తో కుమ్మక్కై..

మొదటిపేజీ తరువాయి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి పలు సర్వేల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ బలం కంటే నవీన్ యాదవ్ ప్రాబల్యం ఎక్కువని తేలిందని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకే బలం ఉంటే అజారుద్దీన్‌కు తిరిగి టిక్కెట్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గతంలో మజ్లిస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన నవీన్ యాదవ్‌కు టిక్కెట్ ఇవ్వడం ద్వారా, మీకు గెలుస్తామనే విశ్వాసం లేదని స్పష్టమవుతోందని అన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కూడా బీజేపీకి చెందిన గణేశ్‌ను తీసుకువచ్చి టిక్కెట్ ఇచ్చారని, కానీ గద్దర్ కుమార్తెకు మాత్రం టిక్కెట్ ఇవ్వలేదని విమర్శించారు. సొంత పార్టీలో ఉన్నవారిని విస్మరిస్తూ బీజేపీ, మజ్లిస్ పార్టీల నుంచి వచ్చిన వారికి టిక్కెట్ ఇచ్చారని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో రేవంత్ రెడ్డి గెలవలేదని, నవీన్ యాదవ్ గెలిచారని ఆయన అన్నారు. తాను అమలు చేసిన పథకాల వల్లే గెలిచానని రేవంత్ రెడ్డి భావిస్తే అది పొరపాటు అని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉందని, గెలుపోటములు సహజమని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులపై రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియాను కూడా బెదిరింపులకు గురిచేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కొడంగల్‌లో ఓడిపోయారని, ఆయన గతంలో ఎంపీగా గెలిచిన మల్కాజ్‌గిరిలో ఎందరు కార్పొరేటర్లను గెలిపించారని ప్రశ్నించారు. ఈ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అసదుద్దీన్ ఒవైసీ కాళ్లు మొక్కి, బండి సంజయ్‌తో కుమ్మక్కై మజ్లిస్ ఓట్లతో పాటు బీజేపీ ఓట్లను బదిలీ చేసుకోవడం ద్వారా గెలిచారని ఆయన విమర్శించారు.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్.. ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ ఈ సమ్మిట్‌లో ప్రధాన అంశమని తెలిపారు. రాష్ట్రం సాధించిన అభివృద్ధితో పాటు.. భవిష్యత్ ప్రణాళికలను ప్రపంచం ముందుంచేందుకు ఇది మంచి అవకాశమని సీఎస్ పేర్కొన్నారు.సదస్సులో వివిధ రంగాలకు చెందిన సుమారు 1300 మంది పాల్గొంటారని చెప్పారు. పారిశ్రామికవేత్తలు, ఐటీ నిపుణులు, గ్లోబల్ ఇన్వెస్టర్లు, దౌత్య ప్రతినిధులు, క్రీడా, సినీ ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. సీఐఐ, ఫిక్కి, నాస్కామ్, అసో చామ్, బ్యాంకింగ్, ఆర్థిక సంస్థల ప్రతినిధులు హాజరవుతారన్నారు. సమ్మిట్‌లో ఆడియో, వీడియో ప్రజంటేషన్లు, గ్రాఫిక్, యానిమేటెడ్ వీడియో ప్రదర్శనలతో కూడిన 70 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమీక్షలో ఉన్నతాధికారులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, సవ్యసాచి ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

# పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు

తెలంగాణ రాష్ట్రంలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో సుమారు రూ. 2.51 లక్షలు మేర లెక్కల్లో చూపని నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, 289 రిజిస్ట్రేషన్ పత్రాలు ప్రజలకు చేరకుండా కార్యాలయాల్లోనే ఉండిపోయినట్లు గుర్తించారు. అధికారుల అనుమతి లేకుండానే 19 మంది ప్రైవేటు వ్యక్తులు, అలాగే 60 మంది డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయాల్లో సంచరిస్తున్నట్లు గుర్తించారు. పలు కార్యాలయాల్లో సీసీటీవీ కెమెరాలు పనిచేయడం లేదని కూడా అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా 13 మంది సబ్ రిజిస్ట్రార్ అధికారుల నివాసాల్లో కూడా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. వారి ఇళ్లలో పెద్ద మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు, ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

# బిహార్ బీజేపీలో తీవ్ర కలకలం..

## - పార్టీ నుంచి కేంద్ర మాజీమంత్రి సహా ముగ్గురు సస్పెండ్

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించిన తర్వాతి రోజే.. బీజేపీ సంచలన నిర్ణయం తీసుకుంది. బిహార్ ఎన్నికల సమయంలో.. బీజేపీ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ముగ్గురు సీనియర్ నేతలను సస్పెండ్ చేయడం ఆ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర అలజడి రేపింది. ఇక సస్పెన్షన్ వేటు పడిన ముగ్గురిలో కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ నేత ఆర్‌కే సింగ్ కూడా ఉండటం గమనార్హం. ఆర్‌కే సింగ్‌తోపాటు.. ఎమ్మెల్సీ అశోక్ అగర్వాల్, కతిహార్ మేయర్ ఉషా అగర్వాల్‌లపై వేటు పడింది.ఇక బిహార్ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయ ఇంఛార్జ్ అరవింద్ శర్మ ఈ ముగ్గురు నేతలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పార్టీకి నష్టం కలిగించినందుకు గాను.. వారిని ఎందుకు బహిష్కరించకూడదో వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసుల్లో ఆదేశాలు జారీ చేశారు. ఆరా నియోజకవర్గం నుంచి గెలిచిన మాజీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి ఆర్‌కే సింగ్ .. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటి నుంచి బీజేపీ నాయకత్వంపై, బిహార్ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఇక మరీ ముఖ్యంగా బిహార్ బీజేపీలో కీలక నేత, బిహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరి టార్గెట్‌గా విమర్శలు గుప్పించారు. ఎన్నికల వ్యూహకర్త, జన సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ చేసిన అవినీతి ఆరోపణలకు తోడు.. ఆర్‌కే సింగ్ కూడా సామ్రాట్ చౌదరిపై తీవ్ర విమర్శలు చేయడంతో ఈ చర్యలు తీసుకున్నారు. సామ్రాట్ చౌదరి, బిహార్ బీజేపీ చీఫ్ దిలీప్ జైస్వాల్‌ను.. హత్య నిందితులు అంటూ ఆర్‌కే సింగ్ అభివర్ణించడం తీవ్ర దుమారానికి కారణం అయింది. ఇలాంటి నాయకులకు ఓటు వేయడం కంటే.. నీళ్లలో మునిగి చావడం మంచిదని బిహార్ ఎన్నికలకు ముందు ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.ఈ సందర్భంగా సామ్రాట్ చౌదరి.. చదువుకున్న చదువుపై వచ్చిన అనుమానాలను ఆయన నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా.. జేడీయూకు చెందిన గ్యాంగ్‌స్టర్, రాజకీయ నాయకుడు అనంత్ సింగ్‌ను టార్గెట్ చేస్తూ కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే ఆర్‌కే సింగ్ తీవ్ర విమర్శలు చేసిన.. సామ్రాట్ చౌదరి, ఆర్‌కే సింగ్ కూడా తమ నియోజకవర్గాల్లో ఈ ఎన్నికల్లో విజయం సాధించారు.బిహార్ కేడర్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అయిన ఆర్‌కే సింగ్.. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర హోం శాఖ కార్యదర్శిగా పనిచేశారు. 2013లో బీజేపీలో చేరిన ఆర్‌కే సింగ్.. 2014, 2019లో ఆరా నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచారు. 2014 నరేంద్ర మోదీ కేబినెట్‌లో.. కేంద్ర విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. బీజేపీ తీసుకున్న ఈ సస్పెన్షన్ నిర్ణయం కేవలం తాత్కాలిక ప్రక్రియ మాత్రమేనని.. త్వరలోనే ఈ ముగ్గురినీ పార్టీ నుంచి బహిష్కరించనున్నట్లు బిహార్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.

# పౌరులకు బలమైన ఈసీ అవసరం

## బీహార్ ఎన్నికలపై స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు

బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. ముఖ్యంగా 202 సీట్లతో ఎన్డీఏ ఘన విజయాన్ని దక్కించుకోగా.. మహాగఠ్‌బంధన్ ఘోర పరాభవం పాలైంది. ఈ నేపథ్యంలో.. తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ తన ప్రత్యేక విశ్లేషణను ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. ఈ ప్రకటనలో ఆయన విజయం సాధించిన నితీష్ కుమార్‌కు అభినందనలు తెలుపుతూనే.. ఎన్నికల్లో గెలిచేందుకు తీవ్రంగా కష్టపడిన తేజస్వీ యాదవ్‌పై ప్రశంసలు కురిపించారు. మరోవైపు భారత ఎన్నికల సంఘం పని తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దీంతో ఈ విషయం కాస్తా జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. "బీహార్ ఎన్నికల్లో నిర్ణయాత్మక విజయం సాధించిన సీనియర్ నాయకులు నితీష్ కుమార్ గారికి నా అభినందనలు. బీహార్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని ఆకాంక్షిస్తున్నాను. అదే విధంగా అలసిపోకుండా ప్రచారం చేసిన యువ నాయకులు తేజస్వి యాదవ్‌ను కూడా అభినందిస్తున్నాను" అని స్టాలిన్ మొదట పేర్కొన్నారు. ఆ తర్వాత ఫలితాలు ఈసీఐ దుశ్చర్యలను కడిగిపారేయవని చెప్పారు. ఈసీఐ ప్రతిష్ట ప్రస్తుతం పాతాళానికి చేరిందని చెప్పారు. ఈ దేశ పౌరులు ఒక బలమైన, నిష్పక్షపాతమైన ఎన్నికల సంఘాన్ని కోరుకుంటున్నారని వివరించారు. ఓడిపోయిన వారిలో కూడా విశ్వాసాన్ని నింపే విధంగా ఎన్నికల నిర్వహణ ఉండాలని స్టాలిన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. బీహార్ ఎన్నికల ఫలితాల ద్వారా అందరూ నేర్చుకోవాల్సిన కొన్ని ముఖ్యమైన పాఠాలు ఉన్నాయని చెప్పిన సీఎం స్టాలిన్.. వాటిని విశ్లేషించారు. ఎన్నికల ఫలితాలు నాలుగు ప్రధాన అంశాలను ప్రతిబింబిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. అందులో ఒకటి సంక్షేమ పథకాల అమలని, రెండోది సామాజిక, సైద్ధాంతిక కూటములని తెలిపారు. ఇక మూడోది స్పష్టమైన రాజకీయ సందేశమని, నాలుగోది చివరి ఓటు పడే వరకు అంకిత భావంతో కూడిన నిర్వహణ ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఫలితాల నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలను ఇండియా కూటమి నాయకులు అర్థం చేసుకోగల సమర్థులు అని.. రాబోయే సవాళ్లను ఎదుర్కోవడానికి వ్యూహాత్మకంగా ప్రణాళికలు రూపొందించగలరని స్టాలిన్ విశ్వాసం వ్యక్తం చేశారు.ఒకవైపు విజేతను అభినందిస్తూనే.. మరోవైపు ఎన్నికల ప్రక్రియ యొక్క అత్యున్నత సంస్థ పని తీరుపై ఇంత తీవ్రంగా వ్యాఖ్యానించడం ద్వారా స్టాలిన్ దేశంలో ఎన్నికల సంస్కరణల ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఈ వ్యాఖ్యలు రాబోయే ఎన్నికల్లో విపక్షాల ఉమ్మడి వ్యూహం, ఈసీఐ పారదర్శకతపై దృష్టి పెట్టే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# బిహార్ ఎన్నికల్లో రిగ్గింగ్'

## - ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగింపు - కాంగ్రెస్ సంచలన ఆరోపణలు

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్?డీఏ ఘన విజయం సాధించిన వేళ కేరళ కాంగ్రెస్ సంచలన వ్యాఖ్యలు చేసింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 128 నియోజకవర్గాల్లో రిగ్గింగ్ జరిగిందని ఆరోపించింది. ఎన్?డీఏ గెలిచిన 202 అసెంబ్లీ నియోజకవర్గాల్లో, 128 స్థానాల్లో విజయం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చేపట్టిన సమయంలో తొలగించిన ఓట్లు తర్వాత వచ్చిందని విమర్శించింది. ఓట్ల తొలగింపు డేటాను విశ్లేషించి, ప్రతి నియోజకవర్గంలోని గెలుపు మార్జిన్?తో పోల్చిన అనంతరం కాంగ్రెస్ ఈ ఆరోపణలు చేసింది.ఎస్ఐఆర్ నిర్వహించి కేంద్ర ఎన్నికల సంఘం నిజమైన ఓటర్లను ఏకపక్షంగా తొలగించిందని కాంగ్రెస్ ఆరోపించింది. "బిహార్ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగింది. ఎన్ డీఏ గెలిచిన 202 స్థానాల్లో 128 సీట్లు ఎస్ఐఆర్-ఆధారిత ఓట్ల తొలగింపుల ద్వారా గెలిచింది. సుప్రీంకోర్టు ఆదేశించిన తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల తొలగింపు డేటాను మేము విశ్లేషించాం. ప్రతి నియోజకవర్గంలోని గెలుపు మార్జిన్ తో పోల్చాం. అప్పుడు తేడా స్పష్టంగా తెలిసింది. నిజమైన, జీవించి ఉన్న ఓటర్లను ఎస్ఐఆర్ కింద ఏకపక్షంగా తొలగించారు." అని కేరళ కాంగ్రెస్ ఎక్స్?లో పోస్ట్ చేసింది.ఈసీ విడుదల చేసిన డేటా సెట్?లో ఒక్క అక్రమ వలసదారుడు కూడా కనిపించలేదని హస్తం పార్టీ తెలిపింది. ఎస్ఐఆర్ పేరుతో ఎన్?డీఏ పేద, బడుగు, బలహీన వర్గాల ఓటర్లను తొలగించిందని ఆరోపించింది. ఎస్ఐఆర్ చేపట్టి బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్ నుంచి వచ్చిన అక్రమ వలసదారులను గుర్తించి ఓటర్ జాబితా నుంచి తొలగించాల్సి ఉందని పేర్కొంది. కానీ ఎన్నికల సంఘం విడుదల చేసిన మొత్తం డేటా సెట్ లో ఒక్క అక్రమ వలసదారుడు కూడా లేరని స్పష్టం చేసింది. భారత్ ప్రజాస్వామ్యానికి తల్లి అని ప్రధాని మోదీ గతంలో చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ ఉదహరించింది. బీజేపీ గేమ్ ప్లాన్?ను ప్రజలు గ్రహించాల్సిన అవసరం ఉందని, లేదంటే భారతీయ జనతా పార్టీ ప్రతి పౌరుడిని ఓటరు జాబితా నుంచి తొలగిస్తుందని ఎద్దేవా చేసింది."నిజానికి జరిగింది ఎస్ఐఆర్ పేరుతో ఎన్?డీఏ పాలనలో బాధపడుతున్న పేద, దుర్బల ఓటర్లను తొలగించడానికి జరిగిన ఒక పెద్ద ప్రక్షాళన. పేదలను ఓటర్ జాబితా నుంచి తొలగించి, ఓట్లు వేయకుండా అడ్డుకున్నారు. ఆ తర్వాత దశలవారీగా ఎన్నికలు నిర్వహించారు. అసలైన ఓటర్ల స్థానంలో డమ్మీ బ్రెజిలియన్లను ఓటర్ జాబితాలో చేర్చుతారు. వారి తరపున ఓటు వేస్తారు. అలాగే ఎప్పటికీ ఎన్నికలలో బీజేపీ గెలుస్తూనే ఉంటుంది" అని కేరళ కాంగ్రెస్ విమర్శించింది.మరోవైపు ఈవీఎంలు, ఈసీపై మహాగఠ్ బంధన్ ఆరోపణలు గుప్పించడంపై ఎల్జేపీ(రామ్ విలాస్) పార్టీ అధినేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ మండిపడ్డారు. వారు తమ తప్పులను సమీక్షించుకోవడానికి సమయం కేటాయిస్తే మంచిదని ఎద్దేవా చేశారు. "మహాగఠ్ బంధన్ నాయకులు ప్రతి విషయంలోనూ తప్పులు వెతుకున్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం నవంబర్ 16 2025

## ఎన్టిపిసిలు ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

**కరపత్రం ప్రతినిధి, జ్యోతి నగర్(రామగుండం), నవంబర్ 15:**
జ్యోతి నగర్: ఎన్టిపిసి టీటీఎస్ లోని సత్యదేవ స్కూల్ ఆఫ్ ఎక్సెన్స్ జూనియర్ కాలేజీ లో శనివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్టిపిసి ఈడీ చందన్ కుమార్ సామంత విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చేసిన ఆవిష్కరణలు, ప్రాజెక్టులు, ప్రయోగాలు ప్రేరణగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు భవిష్యత్తులో ఈ ప్రదర్శనలు ఉన్నత విద్యలో ఎంతో దోహదపడతాయని ఆయన తెలిపారు. విద్యార్థుల ప్రదర్శనలతో సమగ్ర విద్యపై ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జ్ఞాన్ చంద్, ఎన్టీపీసీ అదనపు జీఎం బిజొయ్ కుమార్ సిగ్దార్, అధికారులు ప్రవీణ్, ఆశిష్, రవి, కెవిఎంకె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు మునిసిపల్ కమిషనర్ మొహమ్మద్ అయాజ్ .

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట నవంబర్ 15**
జమ్మికుంట మునిసిపాలిటి పరిది లోని ఫ్లయ్ ఓవర్ బిడ్జే క్రింది ఇరు వైపులా షాపు యజమానులు ప్రజలకు , వహన దారులకు ఎలాంటి ఇబ్బంది కాకుండా షాపు యజమానులు రోడ్డు పైకి అక్రమించారాడు అక్రమించిన వారి పై కఠిన చర్యలు తప్పవు . కమీషనర్ మొహమ్మద్ అయాజ్ . బ్రిడ్జ్ క్రింద ఇరు వైపులా షాపు లను బ్రిడ్జ్ క్రింద పర్య వేక్షించినారు మునిసిపల్ ఇంజనీర్ కు , సానిటరీ ఇనస్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి షాపు యజమానులు ప్రజలకు , వహన దారులకు ఎలాంటి ఇబ్బంది కాకుండా మీరు రోజు పర్య వేక్షణ చెయ్యాలి అని పలు సూచనలు చేసినారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ వికాస్, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, సానిటరి ఇన్స్పెక్టర్ మహేష్ , సదానందం, టి పి బి ఓ దీపిక , టౌన్ ప్లానింగ్ సిబ్బంది మాధవ్, రామరాజు తో పాటు పారిశుధ్య జవానులు పలువురు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
### - కోరుట్ల సీఐ సురేష్



**కొండబత్తిని అమర్ నాథ్, కోరుట్ల ప్రతినిధి**
శనివారం కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలో పొలాస అగ్రికల్చర్ కళాశాల ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కోరుట్ల సీఐ సురేష్, యువత గంజాయి, డ్రాక్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. వీటిని అమ్మినా, కొన్నా చట్టపరమైన కఠిన శిక్షలు తప్పవని, ఈ మత్తులో యువత జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాల నిర్మూలనలో అందరూ భాగం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కళాశాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన కోరుట్ల ఎమ్మెల్యే



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శనివారం మల్లాపూర్ మండలం రాఘవపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం ప్రభుత్వ విభాగాల ప్రధాన బాధ్యత అని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆలస్యం కాకుండా ధాన్యం కొనుగోలు జరగాలని ఆయన ఆదేశించారు.

## బీసీ ఆక్రోశ సభకు తరలి వెళ్తున్న బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులు

**కరపత్రం ప్రతినిధి భూపాలపల్లి అక్టోబర్ 15**
42% బీసీ రిజర్వేషన్స్ సాధన సమితి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ రోజు కామారెడ్డిలో జరిగే బీసీ ఆక్రోశ సభకు తరలిన వెళ్తున్న భూపాలపల్లి జిల్లా కేంద్రం నుండి బీసీ ఎస్సీ ఎస్టీ జాక్ & ధర్మసమాజ్ పార్టీ నాయకులు. ఈ సందర్భంగా బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్ కొత్తూరి రవీందర్ , బిసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు క్యాతం మహేందర్ మాట్లాడుతూ.... గత 78 సంవత్సరాల స్వతంత్ర భారత ప్రయాణంలో దేశ జనాభాలో మెజారిటీ అయిన బీసీలు ప్రతి రంగంలోనూ అణచివేయబడ్డారు. రాజకీయ, ఆర్థిక, విద్యా ,ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఎక్కడ కూడా వారికి జనాభా నిష్పత్తికి సరిపడా ప్రాతినిధ్యం లేదు.



రాజకీయంగా చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు లేవు ,అందువల్ల చట్టసభలలో వారి ఉనికి నామ మాత్రమే. ఉద్యోగాలు విద్యా రంగాల్లో కూడా రిజర్వేషన్లు పూర్తిగా అమలు కావడం లేదు. రాష్ట్రంలో 130 కులాల బీసీ సమూహం రెండు కోట్ల నలభై లక్షల జనాభా ఉండగా ,వారు పొందుతున్న రిజర్వేషన్ కేవలం 29 శాతం మాత్రమే, కేంద్రంలో రిజర్వేషన్లు 1993 నుంచి అమలు కాగా, రాష్ట్రంలో 1972 నుంచి అమలు కావడంతో లక్షలాది బీసీ యువత ఉద్యోగాలు ,విద్యా అవకాశాలు కోల్పోయారు, ఆర్థికంగా వ్యాపార రంగంలో కూడా బీసీల ఉనికి లేనట్లుగానే ఉంది. ఈ పరిస్థితుల్లో బీసీ సమాజం" మా వాటా మాకు కావాలి - మా అధికారం మాకు కావాలి" అనే నినాదంతో మేల్కొని తమ న్యాయబద్ధమైన హక్కుల కోసం యుద్ధం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడినవి. హిస్సా ,ఇజ్జత్, హుకుమత్ కొరకు పోరాడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి అన్నారు. 42శాతం రిజర్వేషన్ ను భారత రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలనీ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుతానికి డిమాండ్ చేయడం జరిగింది.ఈ సభకు తరలిన వెళ్తున్న నాయకులు ఏ బి ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు గోల్కొండ సురేష్, పుల్ల అశోక్, శీలపాక నాగరాజు, దొమ్మటి రవీందర్, గుండ్ల ఓంకార్, రంజిత్, ఎర్రం రాజ్కు మార్, మట్టేవాడ కుమార్, ముకిడి అశోక్, వంగపండ్ల రాజయ్య యాదవ్, రేణుకుంట్ల మహేష్ ,శిలపాక హరీష్ , బోయిని ప్రసాద్, పుల్ల ప్రభాకర్ పాల్గొన్నారు

# టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ రద్దు

- డిసెంబర్ లో రాష్ట్ర మహాసభలు
- రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, నవంబర్ 15:**
తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) తృతీయ మహాసభలు డిసెంబర్ లో జరపాలని ఫెడరేషన్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్ణయించింది. కాలపరిమితి ముగిసినందున ఫెడరేషన్ రాష్ట్ర కమిటీని పూర్తిగా రద్దు చేస్తూ తీర్మానించింది. రాష్ట్ర మహాసభల నిర్వహణకు కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు చేస్తూ సమావేశం తీర్మానించింది. శనివారం హైదరాబాద్ లో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్ని జిల్లాల నుంచి రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య ను సంఘం నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఇటీవల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వ్యవస్థాపక సభ్యుల సమావేశం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. అదేవిధంగా 2025-27 సంవత్సరాలకు గాను రాష్ట్ర అధ్యక్షుడి నేతృత్వంలో జరిగిన జిల్లాల మహాసభల్లో ఎన్నికైన జిల్లా కమిటీలు యధావిధిగా కొనసాగించాలని సమావేశం తీర్మానించింది. ఇప్పటివరకు మహాసభలు జరగని జిల్లాల్లో ఉన్న అన్ని పాత కమిటీలను రద్దు చేస్తూ తీర్మానించింది. త్వరలో ఆయా జిల్లాల్లో అడ్ హక్ కమిటీలు వేసి జిల్లా మహాసభలు జరపాలని, నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ స్కీం అమలు చేయాలని, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య,వైద్య సదుపాయం కల్పించాలని,







సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ స్కీం అమలు చేయాలని సమావేశం విజ్ఞప్తి చేసింది.

**బసవ పున్నయ్య తొలగింపుకు రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ఆమోదం**

ఫెడరేషన్ ను విచ్ఛిన్నం చేసి నవతెలంగాణలో పనిచేస్తున్న జర్నలిస్టులను, రాష్ట్ర నాయకులను, ఫెడరేషన్ సభ్యులను తప్పుదారి పట్టిస్తూ సంఘానికి సంబంధించిన లెక్కలు చెప్పకుండా సంఘం యొక్క కార్యక్రమాలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన బసవ పున్నయ్యను తొలగిస్తూ రాష్ట్ర అత్యవసర సమావేశం చేసిన తీర్మానాన్ని ఈ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన సభ్యత్వ రుసుము లెక్కలు చెప్పకుండా, డైరీ, మ్యాగజిన్ ద్వారా ఫెడరేషన్ కు వచ్చిన ఆదాయం లెక్కలు చూపకుండా, జిల్లాల మహాసభలు జరపకుండా అడ్డుకుంటూ, సంఘాన్ని విచ్చినం చేసిన అతన్ని ఫెడరేషన్ నుండి శాశ్వతంగా



బహిష్కరించడాన్ని సభ్యులందరూ విస్తృతస్థాయి ఏకగ్రీవంగా ఆమోదించారు. బహిష్కరణకు గురైన బసవ పున్నయ్య కు ఇక నుంచి టీడబ్ల్యూజేఎఫ్ కు ఎలాంటి సంబంధం లేదని సమావేశం స్పష్టం చేసింది. ఫెడరేషన్ పేరుతో ఎలాంటి కార్యక్రమాలు, కార్యకలాపాలు నిర్వహించరాదని సమావేశం తీర్మానించింది. ఈ విషయాన్ని జర్నలిస్టులు, ఫెడరేషన్ శ్రేయోభిలాషులు గ్రహించాలని విజ్ఞప్తి చేసింది. టీడబ్ల్యూజేఎఫ్ పేరుతో ఆయన కార్యక్రమాలు చేస్తే... అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకునే బాధ్యతలను రాష్ట్ర కన్వీనింగ్ కమిటీకి అప్పగించింది.రాష్ట్ర మహాసభల కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర తృతీయ మహాసభల నిర్వహణ,ఇతర కార్యక్రమాల నిర్వహణకు ఎనిమిది మందితో రాష్ట్ర కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కన్వీనర్ గా మామిడి సోమయ్య, కో-కన్వీనర్లుగా పులిపలుపుల ఆనందం,బండి విజయ్ కుమార్,ఎం. యాదగిరి,వల్లాల జగన్,ఆర్.వెంకటేశ్వర్లు, తన్నీరు శ్రీనివాస్, కుడితాడు బాపురావు,కర్ర అనిల్ రెడ్డి, జి.వెంకటేశ్వర్లు ఉన్నారు. అదేవిధంగా సంఘం జాతీయ వ్యవహారాల కమిటీ కన్వీనర్ గా సీనియర్ జర్నలిస్టు కూసం సారంగపాణి ని సమావేశం నియమించింది.

# జిన్నింగ్ మిల్లుల వద్ద సి.సి.ఐ. కొనుగోళ్లతో పాటుగా ప్రయివేటు కొనుగోళ్ళు కూడా నిలిపివేస్తాం

- మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట నవంబర్ 15**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం ఆధ్వర్యంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ భారత పత్తి సంస్థ (సి.సి.ఐ.) వారు ఎల్-1, ఎల్-2 విధానాల పేరిట జిన్నింగ్ మిల్లులను, స్లాట్ బుకింగ్ పేరిట రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నందున, తక్షణమే ఎల్-1, ఎల్-2 విధానాలు ఎత్తివేసి, అన్ని జిన్నింగ్ మిల్లులను ఒకే విధానము క్రిందికి తీసుకరావాలని, స్లాట్ బుకింగ్ విధానాన్ని ఎత్తివేయాలని విజ్ఞప్తి చేస్తూ తెలంగాణ రాష్ట్ర జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ వారు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికిని నేటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టనందున, తెలంగాణ రాష్ట్ర జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ వారు ఇచ్చినటువంటి



పిలుపు మేరకు జమ్మికుంట జిన్నింగ్ మిల్లుల వారు తేది 17.11.2025 సోమవారము నుండి అన్ని జిన్నింగ్ మిల్లుల వద్ద సి.సి.ఐ. కొనుగోళ్ళతో పాటుగా ప్రయివేటు కొనుగోళ్ళు కూడా నిలిపివేస్తామని మార్కెట్ కమిటి చైర్పర్సన్ కి, ఉన్నత శ్రేణి కార్యదర్శి కి వినతిపత్రము ఇవ్వడము జరిగినది.రైతు సోదరుల గమనించి, రైతులు ఎవరునూ కూడా వారి పత్తిని జమ్మికుంట మార్కెట్ యార్డునకు తీసుకరావద్దని మరియు "కపాస్ కిసాన్" మొబైల్ యాప్పనందు స్లాట్ బుక్ చేసుకోవద్దని, ఇప్పటికే స్లాట్ బుక్ చేసుకున్నటువంటి రైతులు కూడా పత్తి అమ్మకమునకు జిన్నింగ్ మిల్లులకుగాని, మార్కెట్ యార్డునకు గాని తీసుకరావద్దని రైతులకు విజ్ఞప్తి చేయడము జరిగినది.కావున, కొనుగోళ్ళు ప్రారంభమయిన వెంటనే పత్రికా ప్రకటన ద్వారా, సోషల్ మీడియా ద్వారా రైతులకు సమాచారము ఇస్తామని, రైతులు సహకరించగలరని విజ్ఞప్తి చేయనైనది.చైర్పర్సన్ వ్యవసాయ మార్కెట్ కమిటి, జమ్మికుంట

# పారిశ్రామిక ప్రతినిధులతో సిఎం చంద్రబాబు బిజీ

**కరపత్రం ప్రతినిధి విశాఖపట్టణం,నవంబర్14**
విశాఖపట్టణంలో రేపు, ఎల్లుండి జరగనున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి కీలక వేదికగా మారనుంది. సీఐఐ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి ముందుగా, ఈ రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశంలోని ప్రముఖ కంపెనీల చైర్మన్లు, సీఈఓలు, విదేశీ రాయబారులతో భేటీ కానున్నారు. సాయంత్రం వివిధ కంపెనీలతో ఎంఓయూలు కుదుర్చుకోనున్నారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించి, ఉపాధి అవకాశాలను సృష్టించే లక్ష్యంతో జరుగుతుంది. విశాఖ ఆర్థిక ప్రాంతంలో పారిశ్రామిక వృద్ధికి ఈ సదస్సు ఊతమిస్తుంది.ఉదయం 10 గంటలకు నోవోటెల్ హోటల్లో ఇండియా-యూరప్ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు గ్రీన్ షిఫ్ట్, సస్టైనబుల్ ఇన్నోవేషన్, యూరోపియన్ పెట్టుబడులపై పారిశ్రామిక ప్రతినిధులతో చర్చిస్తారు. "పార్టనర్స్ ఇన్ ప్రోగ్రెస్: ఇండియా-యూరప్ కోఆపరేషన్ ఫర్ సస్టైనబుల్ గ్రోత్" అనే అంశంపై ఈ చర్చలు రాష్ట్రంలో పర్యావరణ హిత పరిశ్రమల అభివృద్ధికి దోహదపడతాయి. మధ్యాహ్నం తైవాన్, ఇటలీ, స్వీడన్, నెదర్లాండ్స్ ప్రతినిధులతో భేటీలు రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులను పెంచే అవకాశం కల్పిస్తాయి. సీఎం చంద్రబాబు ఎస్పీపీ పంప్స్ ఎండీ అలోక్ కిర్లోస్కర్, రెన్యూ పవర్ చైర్మన్ సుమిత్ సిన్హా, మురుగప్ప గ్రూప్ చైర్మన్ అరుణ్ అలగప్పన్, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ చైర్మన్ రాహుల్ ముంజాల్ వంటి ప్రముఖులతో సమావేశమవుతారు. ఈ భేటీలు రాష్ట్రంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిన్యూవబుల్ ఎనర్జీ, టెక్నాలజీ రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేస్తాయి. సాయంత్రం 'వైజాగ్ ఎకనమిక్ రీజియన్' కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొని, విశాఖ ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశాలను వివరిస్తారు. ఈ కార్యక్రమం రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దిశానిర్దేశం చేస్తుంది.సీఐఐ నేషనల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో చంద్రబాబు హాజరై, రాష్ట్ర పారిశ్రామిక విధానాలను ప్రముఖులతో చర్చిస్తారు. ఈ సదస్సు ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. విశాఖలో జరిగే ఈ కార్యక్రమాలు రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక రంగాల్లో కొత్త అధ్యాయాన్ని తెరుస్తాయి.

# బీసీల్లో అత్యంత వెనుకబడిన కులాల కొరకు మరో వర్గీకరణ చేపట్టాలి

**- బీసీల్లో అత్యంత వెనుకబడిన కులాలను ఆదుకోవాలి**
**-కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ**



**కరపత్రం ప్రతినిధి మంథని, నవంబర్ 15:**
113 కులాలుగా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ప్రవేశ పెట్టడం అభినందనీయమని,ఈ తరుణంలో బీసీల్లో అత్యంత వెనుకబడిన కులాల కొరకు తీవ్ర అన్యాయం జరుగుతున్నందున మరో వర్గీకరణ అవసరం ఉన్నదని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ పేర్కొన్నారు. బీసీలలో ఎంతో కొంత ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందిన కులాలే ఎక్కువ లబ్ధి పొందుతున్నారని, అట్టడుగున ఉన్న కొన్ని బీసీ కులాలకు ఎలాంటి లబ్ధి చేకూరడం లేదనే చర్చ నడుస్తుందన్నారు. మున్నూరు కాపు, యాదవ, గౌడ, ముదిరాజ్ వంటి సామాజిక వర్గాలు కొంతమేర అభివృద్ధి చెందినప్పటికీ బీసీ రిజర్వేషన్ల పలాలు వారే పొందుతున్నట్లు ఇతర బీసీ కులాలు భావిస్తున్నాయన్నారు. చాకలి, మంగలి, కుమ్మరి, గంగాపుత్ర, మేర, ఆరెకటిక లాంటి కులాలకు రిజర్వేషన్ల లబ్ధి చేకూరడం లేదన్నారు. అందువల్ల బీసీలలో ఉన్న ఏ,బి,సి,డి,ఈ గ్రూపులను తిరిగి వర్గీకరించాలని ఎటువంటి రిజర్వేషన్ల లబ్ధి పొందని వారికి రిజర్వేషన్లు పొందే గ్రూపులలో చేర్చాలని ఆయన పేర్కొన్నారు. జనాభా ఎక్కువగా ఉన్న కొన్ని కులాలకి ఎక్కువ అవకాశాలు దక్కడం వల్ల బీసీ రిజర్వేషన్ల లక్ష్యం నెరవేరడం లేదని అన్నారు. ఇంతవరకు కొన్ని కులాలు శాసనసభ మెట్లు కూడా ఎక్కలేదని ఆయన ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను శాస్త్రీయంగా అమలు చేసి అత్యంత వెనుకబడిన కులాల రిజర్వేషన్ల పలాలు అందేటట్టు చూడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. అందుకు తగినట్టుగా ఏ,బి,సి,డి,ఈ తో పాటు మరొక వర్గీకరణ చేసి ఈ,జి గ్రూపులు ప్రవేశపెట్టి అత్యంత వెనుకబడిన కులాలను చేర్చి వారికి కొంత పర్సెంటేజీ ఇచ్చి ఆదుకోవాలని గోటికార్ కిషన్ జీ విజ్ఞప్తి చేశారు.

# కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో చైర్మన్ చాంబర్ బిల్డింగ్ శంకుస్థాపన.........

**- ముఖ్య అతిథిగా హాజరైన హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి వోడితల ప్రణవ్ బాబులి...**





**కరపత్రం ప్రతినిధి కమలాపూర్ నవంబర్ 15**
జమ్మికుంట మార్కెట్ యార్డు నుండి విడిపోయి స్వతంత్ర మార్కెట్ యార్డ్ గా రూపొందిన కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కు చైర్మన్ ఛాంబర్ మరియు పాలకవర్గ సమావేశ భవనము లేనందున, రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబు చొరువతో బిల్డింగు నిర్మాణానికి ప్రహరీ గోడ పునర్నిర్మాణానికి 79.50 లక్షల రూపాయల నిధులు మంజూరు కాగా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీ రవీందర్ అధ్యక్షతన ఒడితల ప్రణవ్ బాబు చేతుల మీదుగా కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతన పాలకవర్గ భవనమునకు శంకుస్థాపన కార్యక్రమం చేయడమైనది. మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషిచేసిన నియోజకవర్గ ఇన్చార్జి ఒడితల ప్రణవ బాబు కి, రాష్ట్ర రవాణా శాఖ బాధ్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ గారికి, వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు కి చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలుపునైనది ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య గౌడ్ సింగిల్ విండో చైర్మన్ పేరాల సంపత్ రావు డైరెక్టర్లు సముద్రాల కృష్ణ జనగాని శివకృష్ణ ఉరుసు తిరుపతి అక్కినపల్లి బిక్షపతి శ్రీధర్ కెత్తే విజయేందర్ చక్కిలం దయాకర్ మిల్కూరి శ్రీనివాస్ నిగ్గుల లింగయ్య కిన్నర కృష్ణమూర్తి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలసాని రమేష్ గౌడ్. మాట్ల రమేష్ మౌటం కుమారస్వామి పుల్లూరి శ్రీనివాసరావు బొల్లం రాజిరెడ్డి పెండ్యాల తిరుపతిరెడ్డి విష్ణు దాసు వంశీధర్ రావు నాంపల్లి ప్రభాకర్ ప్రజాపతి గూడెపు మొగిలయ్య ఆన్ కార్ అశోక్ భాష బోయిన రమేష్ శనిగరం రమేష్ పాక చంద్రమౌళి మౌటం రమేష్ తదితరులు పాల్గొన్నారు

# డయాబెటిక్ యోగా క్లాస్ ముగింపు కార్యక్రమం విజయవంతం.






**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 15**
లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జి ఆధ్వర్యంలో నవంబర్ 2 నుండి 15 వరకు నిర్వహించిన డయాబెటిక్ యోగా క్లాసుల ముగింపు కార్యక్రమం అస్ట్రా కన్వెన్షన్ హాల్, పోలీస్ పరేడ్ గ్రౌండ్స్, కరీంనగర్ లో ఘనంగా జరిగింది.
వరల్డ్ డయాబెటిక్ అవేర్‌నెస్ మంత్ సందర్భంగా ప్రతిరోజూ నిర్వహించిన ఈ యోగా తరగతుల ద్వారా ప్రజల్లో డయాబెటిస్ నియంత్రణ, ఆరోగ్యకర జీవనశైలి, వ్యాయామాల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించబడింది. వందలాది మంది పాల్గొని ప్రయోజనం పొందారు.
ఈ ముగింపు కార్యక్రమానికి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం ప్రధాన అతిథిగా హాజరై లయన్స్ క్లబ్స్ చేపట్టిన ఈ ప్రజోపయోగ కార్యక్రమాన్ని అభినంది మాట్లాడుతూ ఐపీఎస్ ట్రైనింగ్‌లో కూడా యోగా తరగతులు ఉంటాయనీ , ప్రతి రోజు ఉదయం యోగా చేస్తాం అన్నారు.
పూర్వ కాలంలో ప్రజలు శారీరకంగా ఆరోగ్యంగా ఉండేవారని, కానీ నేటి కాలంలో ఆహారపు అలవాట్లు మారడం, శారీరక శ్రమ తగ్గిపోవడం వల్ల డయాబెటిస్, ఊబకాయం పెరుగుతున్నాయని చెప్పారు.
ప్రతి పిల్లలకి చిన్నప్పటి నుంచే యోగా శిక్షణ ఇవ్వడం చాలా అవసరం అని సూచించారు.
ఐ పి ఎం సి సి లయన్ హన్‌మండ్ల రాజిరెడ్డి సిపి కార్యక్రమానికి హాజరైనందుకు ధన్యవాదాలు తెలియజేశారు. అస్ట్రా కన్వెన్షన్ హాల్‌ను అద్భుతమైన వేదికగా వినియోగించుకునే అవకాశం ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
లయన్స్ క్లబ్స్ ఎల్లప్పుడూ సమాజ సేవలో ముందుంటాయని ఆయన పేర్కొన్నారు.
డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ ఎస్. కోదండరాం, లయన్ వి . రాధాకృష్ణారెడ్డి, లయన్ ఏనుగుర్తి రమేష్, లయన్ ఈ. సింగం రాజు, లయన్స్ నాయకులు, సభ్యులు, యోగా ఇన్‌స్ట్రక్టర్లు ముత్యాల రమేష్ , మద్రి రాజేందర్ , పలువురు ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జి, భవిష్యత్తులో కూడా డయాబెటిస్ అవేర్‌నెస్ , ప్రీవెన్షన్ కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తామని ప్రకటించింది.

# లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేములవాడ పట్టణ పరిధిలోని అర్హులైన 19 మంది లబ్ధిదారులకు 7 లక్షల విలువ గల,రూరల్ మండల పరిధిలో అర్హులైన 10 మంది లబ్ధిదారులకు 3 లక్షల 48 వేల విలువ గల,అర్బన్ మండల పరిధిలో 6 లక్షల విలువ గల 16 ముఖ్యమంత్రి సహాయ నిది చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని,మన ప్రాంతంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార, ఎల్ఓసి ల ద్వారా ఇప్పటి వరకు 20 కోట్లు పై చిలుకు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పేదలకు వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు..గత ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 10 సంవత్సరాలలో 400 కోట్లు పంపిణీ చేస్తే ప్రజా ప్రభుత్వ ఏర్పడిన నాటినుండి నేటి వరకు 800 కోట్ల మేర లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది అన్నారు.. ఈ కార్యక్రమంలో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, అర్బన్ మండల అధ్యక్షులు పిల్లి కనకయ్య, రూరల్ మండల అధ్యక్షులు వకులాభరణం శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక రమేష్, నాగుల విష్ణు ప్రసాద్,పుల్కం రాజు, పీర్ మహమ్మద్,గూడూరి మధు, కొలకాని రాజు, ముప్పిడి శ్రీధర్, వస్తాద్ కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), నవంబర్ 15:**
ఎన్టీపీసీ సోలార్ ప్లాంట్ తవ్వకాలలో బయటపడిన దుర్గా దేవి అమ్మవారి పురాతన విగ్రహాన్ని నర్రశాలపల్లిలోని ఖాళీ స్థలంలో ప్రతిష్ఠించారు. ఈ పురాతన అష్ట భుజాల దుర్గా దేవి అమ్మవారి విగ్రహాన్ని దర్శించడానికి హిందూ ఐక్యవేదిక నాయకులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు ప్రత్యేకంగా విచ్చేసి శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ.. అమ్మవారికి శాశ్వతంగా స్థలాన్ని కేటాయించాలని, అలాగే ఆలయ నిర్మాణానికి ఎన్టీపీసీ యాజమాన్యం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన అన్ని వసతులు వెంటనే అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక నాయకులు రావికంటి వరప్రసాద్, రాకేష్, కుమార్, కంతాల సంతోష్ రెడ్డి, బుర్ర శంకర్ గౌడ్, వెంకటేష్, ప్రవీణ్, సాయి, హర్ష, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పుట్టపాకలో 'అయాన్ 2025' వరి రకం క్షేత్ర ప్రదర్శన..



**కరపత్రం ప్రతినిధి మంథని నవంబర్ 15**
మంథని:అధిక దిగుబడిపై రైతుల హర్షం మంథని మండలం పుట్టపాక గ్రామంలో అన్నదాత ఫెర్టిలైజర్స్ అండ్ సీడ్స్ వారి ఆధ్వర్యంలో జీనెక్స్ కంపెనీ ఆధ్వర్యంలో రైతు క్షేత్ర ప్రదర్శన విజయవంతంగా నిర్వహించారు.
గ్రామానికి చెందిన రైతు చాట్లపల్లి రాజయ్య తన ఎనిమిది ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో జీనెక్స్ కంపెనీకి చెందిన 'అయాన్ 2025' వరి రకాన్ని సాగు చేశారు. శనివారం, ఈ క్షేత్రాన్ని ఇతర రైతులతో కలిసి జీనెక్స్ ప్రతినిధులు సందర్శించి క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.
ఈ సందర్భంగా సాగు చేసిన రైతు చాట్లపల్లి రాజయ్య మాట్లాడుతూ.. "అయాన్ 2025 రకాన్ని సాగు చేయడం ద్వారా ఎటువంటి పురుగుమందులు వాడకుండానే చాలా మంచి దిగుబడి సాధించగలిగాను. ఇది నాకు ఎంతో సంతోషాన్నిచ్చింది" అని తెలిపారు.
జీనెక్స్ కంపెనీ ప్రతినిధి రాజశేఖర్ మాట్లాడుతూ.. తమ కంపెనీ లక్ష్యం రైతులకు అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన వరి రకాలను అందించడమేనని పునరుద్ఘాటించారు.
రాబోవు వేసంగి లో జినెక్స్ సీడ్స్ వారి దొడ్డు రకాలైన రాజా, తోప్ సింగ్ రకాలకు అన్నదాతలు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.
ఈ క్షేత్ర ప్రదర్శనలో స్థానిక రైతులు పెద్ద ఎత్తున పాల్గొని కొత్త వంగడంపై ఆసక్తి చూపారు.

## మంథని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారికి అష్టోత్తర శతనామ భజన కీర్తనలతో స్వరాభిషేక మహాయజ్ఞం




**కరపత్రం ప్రతినిధి మంథని నవంబర్ 15**
శివ కేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసం సందర్భంగా కార్తీక బహుళ త్రయోదశి సరియగు తేదీ 17/11/ 25 సోమవారం ఉదయం 9:00 నుండి సాయంత్రం 6:00 వరకు మహిమాన్విత మంథని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారికి అష్టోత్తర శతనామ (108) భజన కీర్తనలతో స్వరాభిషేక మహాయజ్ఞం అంగ రంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుంది కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హరినామ స్మరణ చేసి ఆ లక్ష్మీ నారాయణ స్వామి కృపకు పాత్రులు కాగలరని నిర్వాహకులు జై శ్రీరామ్ గాయక సమూహం తెలంగాణ సృష్టి కర్త శ్రీ కొత్త శ్రీనివాస్ గారు, మరియు జై శ్రీరామ్ గాయక సమూహం తెలంగాణ ప్రధాన నిర్వాహకులు కవి రచయిత గాయకులు ఇన్స్ట్రక్టర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కాటారం దాతలు భక్తులు గాయనీ గాయకులు ఒక ప్రకటనలో తెలియజేయడం జరిగింది

## ఎమ్మెల్యేలను గాడిలో పెట్టాల్సిన బాధ్యత మంత్రులదే

**- మంత్రులతో మంత్రి నారా లోకేష్**
**కరపత్రం ప్రతినిధి అమరావతి, నవంబర్14**
టీడీపీలో నెలకొన్న వివాదాలకు అంతుదరి లేకుండా పోయిందన్నది వాస్తవం. ఎమ్మెల్యేలను కట్టడి చేసే బాధ్యతను మంత్రులకు, ఇంచార్జ్ మంత్రులకు చంద్రబాబు అప్పగించారు. అయితే.. ఇది సాధ్యమేనా? అనే ప్రశ్నలు తెరమీదికి వచ్చాయి. వాస్తవానికి ఇంచార్జ్ మంత్రుల మాటను కూడా ఎమ్మెల్యేలు పెద్దగా లక్ష్యం చేయడం లేదన్నది పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న చర్చ. ఇంచార్జ్ మంత్రులు వస్తున్నారంటేనే ఎమ్మెల్యేలు వారికి అందుబాటులో ఉండడం లేదు. ఒకవేళ నియోజకవర్గంలోనే ఉన్నా.. ఆరోగ్య కారణాలు చూపించి సమావేశానికి డుమ్మా కొడుతున్నారు. ఇలా.. ఇంచార్జ్ మంత్రుల మాట కూడా.. నాయకులు వినిపించుకోవడం లేదు. ఈ విషయాన్ని సదరు మంత్రులు ఇటీవల మంత్రి నారా లోకేష్ దృష్టికితీసుకువెళ్లారు. "మేం ప్రయత్నం చేస్తున్నాం. కానీ, వారు మాట వినడం లేదు." అని తేల్చి చెప్పారు. దీనికి నారా లోకేష్ తనదైన శైలిలో మంత్రం వేశారు. ఎమ్మెల్యేలను గాడిలో పెట్టాల్సిన బాధ్యత మంత్రులదేనని ఆయన కూడా తేల్చి చెప్పారు. ఈ క్రమంలో ఎవరైతే.. ఎమ్మెల్యేలు మాట వినడం లేదో వారి వివరాలను రహస్యంగా తన డ్యాష్ బోర్డుకు ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు.